“కథకుని జ్వరం”

(చైతన్యస్రవంతిలో రచన)

శ్రీ పి. ఎస్. శాస్త్రి

...“సిస్టర్! సిస్టర్! నాకు...నాకు సంధా సిస్టర్? ఏం ధేనా సిస్టర్?...సంధి సంధి...విసంధి జీవన్మరణాల సంధి!...భలేగా వుంది!...సంధ్యావందనం వందనం వందనం...నందనవనం...వనం వనం నందన వందన...వనం!...ఏమిటి... ఏమిటి......ఏమిటది?... సంధించు...సంధిచేయు...సంధించిన బాణం విడువని వాడు...వాడు వాడు శ్రీరాముడు! అవునవును! అవునన్నా! వాడే నా రాముడు. కాపాడేవాడు...పాడేవాడు... వాడు శ్రీరాముడు! జగదోద్ధారకుడు! రామా... శ్రీరామా!...' ననుపాలింపగ నడచి వచ్చితివా?' 'అమలిన శుభ చరిత్రా, కమలదళ సమాననేత్ర'... రామా...నన్ను కాపాడు తండ్రీ!.. 'లాటీ చిత్త సరోమరాళ కుకురీ లావణ్యలోలాత్మకరాటీ' ..అబ్బ ఏం గొప్పగా వుంది! గొప్పా గొప్పన్నరా?...అదికాదు... అదికాదు...ఇది...ఇది విను నేస్తం!...అప్పుడర్థమవుతుంది సమస్తం!...'గగన కల్లోలినీ కల్లోల మాలికా, హల్లీసకములతో అవఘళించి, చరమ సంధ్యాకాల సంఫుల్ల మల్లికా స్తబక పంక్తులతోడ సరసమాడి...' ఎలా వుంది పద్యం? మద్యం త్రాగినట్టు లేదూ?... ఎవరు, ఎవరు, ఎవరు, రాసారో తెలుసా?...తెలుసా నీకు నా మనసా?...'సకల విద్యాసనాథ శ్రీనాథ'... అవునవును...ఆయన... ఆయన .. ఆయనే! అహో ఆ మహనీయుని కవితా ధార!...హేలగా సాగిపోయే కమనీయ కవితాధార!...ధార కాదది అమృతంపు సోన!... దీనారటంకాల తీర్థమాడిన కవిసార్వభౌమునిదా అమృత కవితాధార! ... అమ్మా! అబ్బా! భయం ... బ్రతుకు భయం ... నయం నయం ... అబ్బో బెదురుగా వుంది!...ఎవరూ ఎదురుగా రారేం? సిస్టర్! సిస్టర్! కోపమెందుకు సుగుణ మణీ! వజ్రాల ఖనీ! ఖనీ గనీ మణీ!...సిస్టర్ మణిసిస్టర్!... డాక్టర్! రత్నాలరావు...డాక్టర్...రావూ డాక్టర్... డాక్టర్ ఏడుపొస్తోంది...ఎవరో నన్ను చంపడానికొస్తున్నారు. కాపాడండి కాపాడండి...యముని మహిషపు లోహ ఘంటలు మబ్బుచాటున ఖణేల్మన్నాయి...' ఘంటలు ఘంటలు...మంటలు మంటలు...ఒళ్లంతా మంటలు... బాధ బాధ...బాధ! అయ్యో! అమ్మా!' ఈ యెరిగిన యినుపడేగ. ఈ పండిన మంట పంట...' అమ్మా... కవిత్వం!...త్వం కవి!...అహో! ఓహో!...'ఇపుడా నను పలకరింతురు?'...

'...చూర్ణమాన ఘూర్ణమాన దీర్ణమాన గిరి శిఖరాల్ గిరగిరగిర తిరుగుతున్నాయి...' జగన్నాథ జగన్నాథ జగన్నాథ రథచక్రాల్ ... చక్రాల్ రథ చక్రాల్!' ... విషవాయువు మరఫిరంగి టార్పిడో టార్పిడో ... 'బాబోయ్ ! భయం భయం చావు భయం! ... మీ రక్తం కలగికలగి ... మీ ప్రేవులు కనలి కనలి, ఏడవకం డేడవకండి ...'ఏడవను ఏడవను! శ్రీశ్రీగారూ రక్షించండి!' వయస్సుమళ్లిన, ఎముకలు క్రుళ్లిన సోమరులారా చావండి' అనకండి! ... నాకు వయస్సు మళ్లలేదు... లేదు లేదు లేనేలేదు ! నాకు ఎముకలూ క్రుళ్లలేదు! నిజం నిజం నన్ను నమ్మండి!... రామా! భద్రాద్రిరామా! ... నీవే నన్ను కాపాడాలి...

'...ఎటులబ్రోతువో తెలియ నేకాంతరామయ్యా!

రామా! 'బాలకనకమయచేల సుజనపరిపాల ..' రామా! రామా!... 'రామా ! రామ, కలికుంజరు హస్తము క్రిందుచేసె తాపంబిక బంటుపల్లి!...' బంటుపల్లి తురగా రామన్నగారిని క్రిందుచేసింది ! మరి... మరి బొడ్డుపల్లి? ... 'బొడ్డుపల్లినినమ్మి గొడ్డేరిబోతి'... పాపం...పాపం మా శ్రీనాథుడు!... సరే సరే! ఆపు ఆపు అధిక ప్రసంగం ఆపు !...

రామన్న కథ చెప్పిందెవ్వరు?... ఎవ్వరేమిటి?... ఎవ్వరా? ఎవరూ అని అడుగుతావా? అడుగు తీసి అడుగువేస్తే అక్షరలక్షలు విలువజేసే తేటతెనుగు మరిపించే కథా సార్వభౌముడు...సాహో! మల్లాది రామకృష్ణశాస్త్రి!... జాను తెనుగుకు సానబెట్టి, వజ్రంలా, మణిలా, మాణిక్యంలా ప్రకాశింపజేసిన మహనీయుడెవరయ్యా ?... 'పిచ్చుకత్తులవారు ముందు పరుగు తీయగా...బల్లెములవారు వెనుక అంగ వేయగా... బాకు పట్టినవారు వెంట తరటుపోవంగా...' అదీ అదీ! అలా ప్రాచీన తెలుగుదేశ చరిత్రనూ, సంస్కృతినీ...రాజుల రాణీల పోహలింపులనూ; రంజుగా చెప్పిన రసిక చక్రవర్తి...

'...నవ్వులు పువ్వులై రాసులు దేరంగా—మేటంత పత్రిలో కొండంత దేవుడై, అంతలో కనుమిక్కిలి వెలుగై వెలిగే నివ్వరిమొనవాసి బిందువై — బిందు సందోహమై, సందోహమే నాదకోహళమై... మనకతోచి, మబ్బుతోచి, మబ్బంతగిరిదోచి, గిరికందరాన మంద్రమై, శిఖరి కెగసితారమై, తారకయై, సడియై, స్వనియై, నినదమై, నినాదమై, సంబరమై, సంరంభమై, భరమై వరమై, దహరమై, తాలమై, కేవలము తానై...' అబ్బ! 'ఏమందమేమి సేయుద...'ము!...అబ్బబ్బా! అహో! 'వనమాల' అది! మనస్సు సంతోషంతో, ఆనందంతో గంతులేస్తోంది......అది తెనుగు...కాదు!...కాదు! కాదది! అచ్చతెనుగు! వచనం కాదది కవిత్వం... అవునవును వచన కవిత్వం......ఊహు! కవిత్వపు వచనం...వచన పచన...'కవిత్వం రోకటిదంపు పాట కాదు'...కాదు !

'...ఆ నవ్వు నవ్వులై ... ఆ నవ్వులు లేలేత గొజ్జంగిరేకలై, ఆ రేకలు కెంపులై—వాని అరుణిమ తళుకు—మంచుగా—చినికి, చినికి...జడిగట్టి...ఆ ముద్దముత్తైదువై కనుల ఆనందనీలాలు చిలుకంగా ఆ జిలుగులు చివురించంగా...' ఏమైంది ఏమైంది? ఏదో అయింది !...కాని ఆ శైలి!...శైలా అది తెనుగురాసి !

...బాబోయ్! జ్వరం...జ్వరం ..వేడిజ్వరం... వళ్లు కాలుతోంది! ఏంచెయ్యనేంచెయ్యను? సిస్టర్! మణీ సిస్టర్! నీలమేఘశ్యామా!...రారమ్మా! సిస్టర్! నీ చల్లని చేతో నాతలను తాకు సిస్టర్! తెల్లని నీ దుస్తులు—చల్లని నీ చూపులు—కావాలి కావాలి సిస్టర్!...లేవా లేవా సిస్టర్? ఎక్కడి కెళ్లావ్?... ప్రక్కనే వున్నావా? సిస్టర్! సిస్టర్! నీ చేయి పట్టుకోనీ సిస్టర్!...పడిపోతున్నా...'అగాధ, జలాంధకార తరంగాలపై' పడిపోతున్నా సిస్టర్! అమ్మా! రామా! శ్రీరామా!...నను కాపాడరావా? డాక్టర్! డాక్టర్!...త్వరగా రండి డాక్టర్!... ఇది నిశాంత తమఃక్రాంతమిది దరిద్ర విూ నిశాంతమ్ము మధ్య...' భయమేస్తోంది డాక్టర్! నేను చచ్చిపోతున్నా! 'ఏను మరణించుచున్నాను, ఇటు నశించు నా కొరకు చెమ్మగిలు నయనమ్ములేదు!'...ఏడుపొస్తోంది! ఏం చెయ్యనేం చెయ్యను డాక్టర్!...'విూరు మనసారగా ఏడ్వ నీరు నన్ను, యవనికాభ్యంతరమున వెక్కి వెక్కి రోదింతును వినువులేక...' అమ్మా! కాళీ మాతా! కరుణించు తల్లీ!...

'సూర్యనారాయణా వేదపారాయణా, లోకరక్షామణీ, దైవ చూడామణీ, ఆత్మరక్షామణీ!... 'స్వామీ సూర్యదేవా! నీవే దిక్కు!...బాబోయ్ చీకటి చీకటి...కటిక చీకటి...స్మశానం...దయ్యాలు భూతాలు అంతా భీతావహంగా వుంది...కొరివి దెయ్యాలు... మంటలు...గంటలు... శంఖలు! 'శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం, ప్రభా దివ్యకాయం . ఓ వీర హనుమంత, ఓంకార శబ్దంబునన్ భూతప్రేత పిశాచ శాకినీ ఢాకినీ, కామినీ మోహినీ గాలిదెయ్యా బులన్, నీదు వాలంబునన్ జుట్టి నేలంబడంగొట్టి...అహో!

ఓహో! అమ్మమ్మమ్మయ్య! అయ్యో!...పారిపోయాయి దెయ్యాలు...దెబ్బకు దెయ్యం వదిలింది...

...స్మశానం...కశ్మలంతో నిండిన ప్రదేశం... కాలయముని కేళీవిహార స్థలం!...'ఇది పిశాచులతో నిటా లేక్షణుండు గజ్జె కదలించి యాడు రంగ స్థలంబు ..' అవునవును! ఆ మంజీరాల ధ్వని విని పిస్తోంది...నా గుండె అదురుతోంది!...ఎందుకు ఎందుకెందుకు? ఢమరుక నాదానికి!...' ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము నిప్పులలోన కరగి పోయె'...అమ్మ బాబోయ్! . నేనూ నా కలమూ అలా కరిగి పోవడమే?...ఊహు! వద్దు వద్దు! నాకు మరణం వద్దు! నా శ్రాద్ధం వద్దు!...బ్రతకాలి నేను!...నిజం నిజం!...' నేనేదో విరచిస్తానని నా తపస్సు ఫలించి, నా గీతం గుండెలతో ఘూర్ణిల్లగ, నా జాతి జనులు పాడుకునే మంత్రంగా మ్రోగించాలనీ' అనుకున్నాను...కనుక నా మీద దయదలచి నన్ను వదలండి...వదలండిరా యమదూతల్లారా! .. ...'చంద్రశేఖర. చంద్రశేఖర, చంద్రశేఖర పాహిమాం... చంద్రశేఖర, చంద్రశేఖర, చంద్రశేఖర రక్షమామ్!... చంద్రశేఖర మాశ్రియే మమ కింకరిష్యతి, వైయమః?' .. పారిపోయారు...శివుని దెబ్బకు తాళలేకపోయారు... యారు పోయారు ... యారు ? ... వారు కాలని భటులు ...కాలికి బుద్ధిచెప్పారు...భలే భలే!...పొగుడు పొగుడు శివుణ్ణి పొగుడు ... 'కరాళ బాలపట్టికాద్ధగద్ధగద్ధగజ్వల ద్ధనుంజయా ధరీకృతా ప్రచండ పంచ సాయకే ... ద్ధిమిద్ధిమిద్ధిమి ధ్వనన్మృదంగ తుంగ మంగళ— ధ్వనిక్రియ ప్రవర్తిత ప్రచండ తాండవ శ్శివాః...' శంభో మహాదేవ!...

...'అమ్మా! అలుపుగావుంది...అయ్యో బాధగా వుంది...అయ్యయ్యో భయంగావుంది!' ... చీకటి... మృత్యువు ఛాయలా వ్యాపించిన పెనుచీకటి ... 'లోకంబులు లోకేశులు—దెగిన తుది నలోకంబగు పెంజీకటి కవ్వల...' ఎవరు? ఎవరు? ఎవరున్నారు?... 'సహస్ర శీర్షం దేవం, విశ్వాక్షం, విశ్వ శంభువమ్... విశ్వం నారాయణం దేవ మక్షరం పరమం పదమ్... విశ్వతః పరమాన్నిత్యం, విశ్వం నారాయణగ్ంహరిమ్!... అవునవును! ఆయనే!...నిజం! ...'నిష్కళో నిరంజనో నిర్వికల్పో నిరాఖ్యాతః' ... ...ఇంకా ...'శుద్ధో దేవ ఏకో నారాయణః నద్వితియోస్తి కశ్చిత్!' ...అంతే! అంతే! నారాయణు డొక్కడే! రెండన్నది లేదు లేదు!...లేనేలేదు!...వేరుమాట లేదు.

మరి నమకం చమకమో ? . '...ఓం అను కామశ్చమే, కామశ్చమే, సౌమనశ్చమే, భద్రం చమే శ్రేయశ్చమే... నమోరుద్రాయ విష్ణవే మృత్యుర్మే పాహి, మమ మృత్యుర్నశ్యత్వాయుర్వర్ధతామ్ !' ...మరి విష్ణువా, రుద్రుడా? ఎవరు, ఎవరు, ఎవరు గొప్ప? ఎవరిని ఎవరిని పూజించను ? భజించను... సేవించను? ఎలా ఎలా ఎలా? తల పగిలిపోతోంది...

'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి'... అంతే! అంతే! ఏదో ఒక దేవుడికి ... చెయ్యి నమస్కారం చెయ్యి చెయ్యి ! వెయ్యి వెయ్యి పూలమాలలు వెయ్యి!... వెళ్ళువెళ్ళు త్వరగా వెళ్ళు !... నీరసం...రసం లేనిది నీరసం...అమ్మా! సిస్టర్! బత్తాయి రసం యిస్తావా...నీరసంగా వుంది...వెన్నెల జల్లులాంటి నీ చిరునవ్వు చాలు చాలు సిస్టర్ !... కడుపు నిండుతోంది...అబ్బే అబ్బే...వట్టిది సిస్టర్... కడుపు ఆకలితో కాలుతోంది!...ఉత్ప్రేక్ష అంతే! అంతే! అలవాటు...పొరపాటు...చెప్పనెప్ప నెప్పుడూ...చప్పుడు చెయ్యకుండా పడుకోనా?...చెప్పుడు మాటలు వినడం తప్పుకాదా సిస్టర్ !...నువ్వు చెప్పిందీను !... వెళ్ళిపోతున్నావా సిస్టర్ ! అమ్మా అయ్యో...దీనజన పరిపాల శ్రీరాఘవేంద్ర...రామా నన్ను బ్రోవరా...'తళుకు బంగరు కుండ, తొలి సంపంగిదండ, వలపుల సరణి జవాజి బరణి... మకరందముల వాక, మదన శాస్త్రపు టీక రతిచేతి చిల్క, మరవంపు మొల్క !' ఎవరు? ఎవరు? ఇంకెవరు తార !...ఎవరు ఎవరు రాసిందెవరు?...

...'అఖండ మండిత మహీమండల మండనాయమాన పాండ్య మధురాధరా ఖండల శ్రీ విజయరంగ చొక్కనాథ మహీనాథ కృపాకటాక్షవీక్షణ...'ములను పొందిన శేషం వెంకటపతి...అతనికి శేషించినది కీర్తి మాత్రమే !...అదీ క్షుద్రకావ్యమని ఆధునికులచే తిరస్క

రించబడటం...దక్షిణాంధ్ర క్షీణప్రబంధ యుగ కావ్యమని దుమ్మెత్తిపోయబడటం పాపం...పండితులకు మాత్రమే అని ప్రచురించినా పవిత్రత పొందలేదే!... పాపం...పాపం... మరి యిది...ఏది ఏది?...ఏదది?... అదే అదే గుర్తుకురాదేం తొందరగా!..అమ్మా నొప్పి.. నొప్పి ఉన్నట్టు భయం...భయం మూలాన్ని నొప్పి. బావుంది...బావుంది! శశీ! శశీ! నా హృదయం చీల్చేస్తున్నావు!...నువ్వు నా ప్రాణం. నా జీవనం, నా లోకం...నిన్నెవరన్నా పిలిచారా, తకారా, ఆడపులివలె విరుచుకపడి చీలుస్తాను రెండుగా! ఆకాశం పువ్వుల్ని రాలుస్తోంది లేక దీప్తి తన సౌందర్యభారంతో బ్రద్దలై నక్షత్రాలై రాలుతోంది...అబ్బా శశీ! నా చిన్ని శశీ!... శశీ ఎవరు నువ్వు?'...ఎవరు ఎవరు శశీ. నువ్వు?... ఎవరు ఎవరు కవీ నువ్వు? నువ్వు చలానివి—చంచలానివి...అచంచలానివి...అరుణాచల నివాసివి ... 'ఔను చలం ఔను చలం ... నీవన్నది నిజం నిజం!... ...అబ్బా రంగనాథం...నా పీక పిసుకుతావెందుకు? 'పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనమ్'! . తెలుసు తెలుసు! నాకు భజగోవింద శ్లోకాలు తెలుసు...జీవితం' నళినీదళ గత జలమతి తరళమ్, తద్వజ్జీవిత మతిశయ చపలమ్!' లా చంచలమైనదనీ తెలుసు...కాని నన్ను చంపుతావేం?...బాబ్బాబు నన్ను చంపకు . 'ఉదర నిమిత్తమ్ బహుకృత వేషః' నిజమే ..కాకపోతే నీ వెలా ఉంటే నా కెందుకు?...అందుకే నిన్ను చంపితే కథ రక్తి కడుతుందని కథ విన్న పదముందీ అంటే చంపేశాను! నా తప్పు వుందా? కథ రక్తి కట్టకపోతే ఎవడు వేసుకుంటాడు? డబ్బెలా వస్తుంది? పొట్టెలా నిండుతుంది? ఆలోచించు నాయనా రంగనాథం!...రక్తి కట్టిందో లేదో కాని నా రక్తం కళ్ల జూస్తావా?... బాబోయ్ బాబోయ్! చంపేస్తున్నాడు...రండి రండి రక్షించండి......

అమ్మయ్య వొదిలాడు...పీడపోయింది...పాడు గోల!...' అయినా రంగనాథం కథలో పాత్రవికదా నీ కెందుకు కోపం? నువ్వు ఛస్తేయేం బ్రతికితే యేం?.. నేను కథా విధాతని, అపర విశ్వామిత్రుణ్ణి, ఇష్టమొచ్చినట్టు ఇష్టమొచ్చినన్ని పాత్రల్ని సృష్టిస్తా! చంపుతా! హ హ హ!...'సృష్టిస్థితిలయకారక'... బాబోయ్ రంగనాథం! రాకు రాకు! నా జోలికిరాకు! మొక్కుతా! మొక్కుతా! నీ కాలికి మొక్కుతా! అమ్మా! అమ్మమ్మా! వెళ్లాడురా నాయనా!...పాత్రలు స్వస్వరూపాలతో కథకుడివిూదకు దాడి వెడితే ఎలాగ బాబా బ్రతికేది...ఏది ఏది ఏది దారి? ఓ మహాత్మా ఓ మహర్షీ...'కమ్మగా బ్రతికితే అది గాంధీ యుగం' ...'లాలస లాలస ఎవరు?...అవును నీ కెట్లా తెలుస్తుంది! 'ఎవరు?' 'ఎవరో!' నే నెరుగుదును వొకప్పుడు' 'ఎక్కడ?' ఏమో! ఏం చేస్తావు వెళ్లి 'పెళ్లి''...'ఎవరికి?'...'ఏమో!' 'ఇంక కనబడవూ?'' 'ఊహూ!'...'వెళ్లండి!' 'ఏమిటి?' భగ్నమైన కల! . 'మళ్ళీ అనేది లేదు జీవితంలో! నాకు మీరు వో సాయంత్రం కల...నేను మీకు వో గంటకల!'.. 'మెల్లిగా నా దృష్టి నా ఆత్మ, మైదానపు చీకట్లో ప్రసరించి వ్యాపించి, ఆక్రమించుకుని, అంతా తానై కొండలమీదనుంచి కొండశిఖరాన మెరిసే నక్షత్ర కాంతిలో లీనమయింది!' ... 'రతీస్తారట అతన్ని! యేమవుతుందో అతని అందం? అతని హృదయం, ఏ గులాబీ పువ్వులకి కొత్త రంగు, యే నక్షత్రాలకి కొత్త మెరుపు, యే మబ్బులకి కొత్త నునుపు యిస్తుందో '...అబ్బ ఎంత అందమైన వాక్యాలు... మనస్సును సంతోష డోలికల్లో ఊగించే శైలి! శైలి! శైలి!...' మీరా! నేనూ వొస్తాను, మీరా నేనూ చస్తా! '.. మీరాబాయి ..కుంభరాణా... 'చ్ఛటచ్ఛటా శబ్దమేమి, చక్రాలకి రక్తమేమి? ఏలోకం తల్లీ యిటు, కనుపించదు కాలనేమి?' ... బాలగంగాధరా రాల్లరగంగ కవితలు పాడినవాడా... నీవు లేవు నీ పాటవుంది!'... మరి నేను లేకపోతే నా పాట వుంటుందా?... ఏ నోటేగా వినిపిస్తుందా 'జల జలమని కురిసింది వాన, జాల్వారింది అమృతపుసోన, దోసిళ్ళతో తాగి తిరిగి వచ్చాను, దుఃఖాశ్రు చావునీ వెళ్ళిపొమ్మన్నాను!' . మృత్యుంజయా! వెళ్ళిపొమ్మన్నా, చావు నిన్నెలా కౌగిలించుకుందీ ? ... 'హేహ్యో!'

పో దూరంగా పో!... రాకు రాకు నాదరికి రాకు!... చాచకు.. చాచకు నీ బాహువుల్ని!

'మేష్టారూ! మేష్టారూ! .. కొట్టకండి మేష్టారూ! చెబుతా చెబుతా! కర్మంబున ద్వితీయ యగు! 'చలువలరేడు, వెన్నెలరేడు, రేరేడు, జాబిల్లి, రేవెలు, చందమామ...' సోకుమూకలగొంగ చుట్టు కైదువుజోదు, పచ్చవిల్తునితండ్రి, లచ్చిమగడు .' చెబుతా చెబుతా...అమ్మా! కొట్టకండి! .. 'మిగిలినవి రేపు అప్పుడెబుతా!' .. అమ్మా వదిలాడురా నాయనా... 'సోగాలము దాపురించినవారు దీపనిర్వాణ గంధము నరుంధతిని, మిత్రవాక్యమును, మూర్కొనరు, క లు విన లని పెద్దలు చెప్పుదురు!...' ఒచ్చిందొచ్చింది! ఈ తెలుగు మాష్టారికి పోయేకాలం వొచ్చింది! పడతా పడతా! .. వీడి భరతం పడతా!...పడతా—తా! తా. వు పడతా!..

...'తాతా ఊతునా?'...ఊఊ!...'సెప్టెంబరు రోడ్డుమీద జెన్నోరెలావుంది?' అడుగు...అడుగు... అలెన్‌గిన్స్‌బర్గ్ నడుగు!...' లక్షలకొద్దీ తండ్రులు వానలో—లక్షలకొద్దీ తల్లులు బాధలో'...'లోలో! హలో!' లాగండ్రా బతుకు, లాగండ్రా బరువు! ... 'చిరంజీవి మానవుడా త్వమేవాహం!'...చిరంజీవి..! చిరంజీవి...జీవి చిరంజీవి.. జీవి...జీ. జీవీజీ...చాలు చాలు బ్రతుకు చాలు...చాలు చాలు బరువుచాలు! మేలు మేలు—చావు మేలు! . అంతే అంతేనా! చివంకి యింతేనా?...చివరకి మిగిలేదేమిటి? ఏమిటి ఏమిటి...చివరకు మిగిలే .. కలగాపులగం...పులగకల...కల...అలవల...తల ..

.. అయ్యో! అయ్యయ్యో! రారయ్యో! మము గన్న తండ్రి మాపాలి దైవమా! ... 'ప్రబల రాజాధి రాజ వీరప్రతాప, రాజ పరమేశ బిరుదవిభ్రాజి...' మూరురాయర గండపెండార మణిమరీచి రింఛోళి ' బహుపరాక్ శ్రీకృష్ణదేవరాయ! ... 'ఏను దెలుఁగు రాయడ నన్నడరాయ .' 'తెలుగొకండ యెల్లనృపులు గొలువ నెరుగవే బాసాడి, దేశభాషలందు తెలుగు లెస్స!'... 'సాహితీ సమరాంగణ సార్వభౌమ'... భేష్ భేష...దేశం తెనుగుదేశం...రాజు కన్నడరాజు...రాజుగారి దైవం తెనుగుల ఆరాధ్యదైవం శ్రీ వేంకటేశ్వరుడు... అహో! అన్నమయ్యా! వినుపింపుమయ్యా నీ విన్నపాలు! ...పాలు...పాపాలు... శాపాలు...అయ్యో పాపం...కర్ణాట సామ్రాజ్య ప్రాభవాన్ని పెంపొందించిన తిమ్మరుసయ్యా! ...అయ్యో అయ్యో!...అంధుడవై 'శ్రీహరి' ప్రసాదాన్ని అమ్ముకుంటూ బ్రతికావా?...ఎవరి శాప మది? ఎవరి పాప మది!...

అంతే అంతే కొందరి బ్రతుకులు అంతే! ... చూడు చూడు యింకా చూడు...రావు సూర్యారావు మహీపతిని చూడు ... ఏడు ఏడు ... చిత్తూరు నాగయ్య చరిత్ర చదివి ఏడు! ఆకాశంలో ఉవ్వెత్తున ఎగిరే త్రివర్ణపతాకం చూడు...ఏడు ఏడు చీకిన దేహంతో, కూలిపోయిన గేహంతో...బక్కచిక్కి మృత్యువు కౌగిలిలో నొక్కుపడ్డ పింగళి వెంకయ్యను చూడు... ఏడు ఏడు...నీకు సాయంచేసి పేరు తెచ్చిన పెద్దలకి నువ్వు చూపించిన ఆదరానికి ఏడు!...అహో ఒహో మానవుడా!...ఒహో అహో దానవుడా' డాడా డూడూ డెడే డడై....

'వచనం లేదు, కవిత్వం అంతకంటే లేదు.' లేదా లేదా కవిత్వం లేదా? ..పిచ్చెత్తి ప్రవచించిన కవిత...' నోరు మూసుకో, గుండుచేసుకో, వీలైతే నాలిక తెగ్గోసుకో!...' 'అంతే అంతే! లేకపోతే ఉరి వేసుకో! కొకో...' కల్లోలపు కడలి అలల తాకుళ్ల మధ్య,... యుద్ధ తిమింగలాల రంపపు పళ్లమధ్య '...లేదూ లేదూ కవిత్వం లేదూ?' ఎవరు వీరు? ఏ యుద్ధంలో క్షతగాత్రులు? ఆ నెత్తురు కాల్వ లేమిటి? ఏ సేనలో సిపాయీలు? మిత్రా వారేరీ? ...'ఏరి ఏరీ ఏ లోకంలోకిపోయి ఈ లోకంకేసి ఆశగా చూస్తున్నారు?...నా దోసిట యాగఫలం పిడికెడు భస్మం నిలిచింది! 'అంతే అంతేనా? మానవుడి బ్రతుకు అంతేనా?'. .

...'సేవే శ్రీగిరి మల్లికార్జున మహాలింగమ్ శివాలింగితమ్!'...'ధూర్జటి నిటలాక్షి!'.. అక్షి అక్షి సాక్షి... నేనీ గదిలో కాపురం వుంటున్నాను. 'ఆ సంగతి యీ సిగరెట్టు ముక్కలు చెబుతున్నాయి'... '...సాలుచందా తొమ్మిది రూపాయలు. విడి ప్రతి మూడణాలు. అణా కానీ కాదు!'...'ఎందుకే అమ్మా ఏడుస్తున్నట్టున్నావు?' 'ఏమీ లేదు!' 'ఎవరే ఆయన?' 'మీ నాన్న స్నేహితుడు' 'పాపం! ఎవరు

ఎవరు ఎవరాయన? 'నాదు గుండెగాయము కుట్టు సూదికంట, అశ్రు జలధార దారమై అవతరించె'... అవతరించె...తరించె... విరించె... డాక్టర్! డాక్టర్ డాక్టర్! సిస్టర్! మణీ సిస్టర్! భయంగా వుంది! ఏమైపోయారు? ఒక్కరూ కనబడరేం? భయం నిజం!...నిజం భయం! అయ్యో! అయ్యో! ఏం చెయ్యను! శాంతం పాపం! పాపశాంతి! తాపశాంతి! 'ఓమ్! గాతుం యజ్ఞాయ, గాతుం యజ్ఞపతయే!... శాంతి మంత్రం. ఏది ఏది...? 'సహనా వవతు, సహనౌ భునక్తు, సహవీర్యం కరవావహై, తేజస్వి నా వధీత మస్తు, మా విద్విషావహై. ఓం శాంతిః శ్శాంతిః శ్శాంతిః...'పద్మా! నువ్వొచ్చావేం పద్మా!...ఆనాడు ఆ నదివొడ్డున నీ పాదాల చెంత కూర్చుని నీ ఆరాధనలో మునిగి, నా తల్లిదండ్రుల్ని వొప్పించలేక దూరంగా తొలగిపోయా! పద్మా! నన్ను క్షమించలేదా? నీ కళ్లు ఎర్రగా వున్నాయేం? నీ జుట్టు చెదిరివుందేం? నీ కన్నుల్లో వెలిగే తళుకులు మాయమై పోయాయేం పద్మా?...నీ భర్తతో హాయిగా కాపురం చేసుకుంటున్నావని, ని సంతోషించాను కదా పద్మా! ఇలా మారి పోయావేం? చెప్పు పద్మా! నన్నింక ఏడిపించకు'... 'నేనా! నేనేనా అందుకు కారణం! ..మన భగ్న ప్రేమ గురించి కథ రాయటమే నీకు ముప్పు అయిందా పద్మా! ..నీ భర్త నిన్ననుమానించాడా పద్మా!...పద్మా బాధపడకు! .. నీ భర్త చేత తన్నులు తినేనా నిజం చెప్పి, నీ కాపురం నిలబెడతా...పద్మా! నిజం పద్మా నన్ను క్షమించు! అపార్థాలు కలిగించి మీ కాపురం చెడగొట్టాలని అలా చెయ్యలేదు పద్మా!...పద్మా నన్ను నమ్మవూ...నా మాట వినవూ? పద్మా... పద్మా...పద్మా!

ముష్! దేవుడా! స్వామీ! రాముడా .రామయ్యా 'సీతారామస్వామీ నే చేసిన నేరంబేమి?'... అలాగని ఏకాంత మా కాదు! మనసు చుట్టూ ఆలోచనలు! ముసుగులు వేసుకున్న భ్రాంతులు!' ఎప్పుడో వొకసారి మనస్సులో తళుక్కున వొక మెరుపు మెరిసి, హృదయం మధురంగా స్పందిస్తుంది! ఆ మధురిమ క్షణం నిల వదు! ' నిజం నిం ఏదీ నిలవదు! కాని కాని ఆ అనుభూతి విభూతి నశ్వరమైన దేహంలోంచి అయ్యో అమ్మ నాయనా! 'ఎందరో మహాను భావులందరికి నా వందనములు' ..లేరా యీ దీనుని కాపాడేవారలు?...'తానెదురైన మదకరీంద్రముడిగ్గి,'... 'ఎంకివంటిపిల్ల లేదోయి లేదోయి ' ఎంకీ యాడుంటివే యెంకి యాడుంటివే' 'నీతోటె వుంటాను నాయుడుబావా! ' బావా! బావా! రావా? .. 'లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె! .. 'అలవైకుంఠపురంబులో నా మూలసౌధంబులో ...' ఎందుకు ఎందుకు భయమెందుకు నాకు ? .. 'నమృత్యుర్నశంకా నమే జాతిభేదాః శివానందరూపః శివోహం శివోహం! ..' 'నవిరోధో నచోత్పత్తి, ర్నబద్ధో నచసాధకః, నముముక్షుర్నవైముక్త ఇత్యేషా పరమార్థతా !'..అంతే అంతే! జగత్తంతా మిథ్య నాకెందుకీ గోల మధ్య! ..

... 'అన్నా శతధా విభిన్నమైన యీ గుండెలో. సంగీతం వినపడుతోంది, చావనని నమ్మకం కలిగింది!' . 'పిల్లా అగ్గిపుల్ల!' .. 'బ్రాహ్మణ్ణి కాళ్ళు పట్టమనవు కదా?' 'బ్రాహ్మలు యెంతకైనా తగుదురు!' . 'డామిట్ కథ అడ్డంగా తిరిగింది! ... 'సమయానికి తగు మాటలాడి...' 'సుబ్బయ్య సంతోషంగా లేడు. రాత్రి జరిగిందంతా అతని మనసును కలచివేసోంది రాత్రి పొందిన సుఖం రాత్రితోనే పోయింది! ఈ మనోరమ ఎవరు?...' ఎవరు ఎవరు సుబ్బయ్య ఎవరు? ఎవరు ఎవరు మనోరమ ఎవరు? .. '.. కాని రాణి పడలేదు. పైన బల్లులు కరిరి బూజు నా నెత్తిన పడింది !'...అంతేరా, పద్మా అంతేనా?... 'ఏతావుంరా నిలకడ నీకు?'...'కణీము రేగిపళ్లు కలి పితే భోగిపళ్లు అంటారు !'...బుడుగుబుడగు చిచ్చుల పిడుగు...గిడుగుగిడుగు... గిడుగు పిడుగు !...ఎవ్వరేమన్న నంద్రుడుగా కేల కొరత, నా కవిత్వంబు నిజము కర్ణాట భాష !...'కాంచీకంకణతారహార కటకగ్రైవేయ భూషావళుల్...' కనకసౌగంధిక గంధోత్త మాగంధసార నిష్పంద పుష్పంధయంబు...'...మరి మా వూరు మరచిపోలేదా కవిసార్వభౌమా? '...సాంద్రవిభవంబు రాజమహేంద్రవరము!' ఎవరు పరిపాలించారయ్యా అప్పుడు? ఔను అప్పుడే! 'దిశ లల్లాడ నల్లాడ భూవల్లభుండు !'...భలే భలే! బాగుంది.

కాని పద్మా!.. 'కాని ఎన్నితిప్పలు పెట్టావురా కేటూ నన్నూ? 'నువ్వు మాత్రం తక్కువవాడివా,

డూప్లికేటూ?'...'ఔరా కూనా! సత్తువుంది, సంబరముంది, గొంతులో బిగువుంది, చూపులో పదునుంది...'...'రాలినపూవు రంగు ముదిరి రేక ముదిరి, పుప్పొడి పూసకట్టి, పూస బుడగంత కెదిగి, గాలి సోకిళ్ల చిటుకుచిటుకు మనంగా—పుప్పొడి మంచు కమ్మకోంగా—రాచకూనకు...' ఎమైంది?... 'ఎవ్వతె వీవు భీత హరిణేక్షణ?...' మోహోపదేశ తమో ముద్రితములైన కనుదమ్ముల హిమాంబులునుపరాదు...' 'దేవతలార యోధికృతులార, నక్షత్రంబులార యోగ్రహములార!...' వాణి నా రాణి'...'సంస్కృతాంధ్రభాషా సామ్రాజ్య సర్వంకష చతుర్విధ కవితానిర్వాహక సాహిత్య రసపోషణ రామరాజు భూషణ ప్రణీతంబైన..'...ధాత్రీశ్వరులుగాని ధాత్రీశ్వరులుగారు...'భలే భలే! 'శ్రీనాథు నర్చించు కరములు కరములు!...ఒకటికాదు మరొకటి అవును! అవునవు నవు నవు ను ..'కలికి నీ సొగసెల్ల గలయు గన్గొనువేళ, గనురెప్పపాటు విఘ్నముగ నెంతు! అంతే అంతేనా పద్మా?...'పండితుల్ని అట్లాగే వాగనీ ముసలి ఖయ్యంతో సుదతీ నువ్వొచ్చెయ్యి!' 'దిక్కులేదు ఆశలేదు, విని వోదార్చె జాలిలేదు తప్పించుకునే తోవలేదు!'...'ఇదంతా ఈశ్వరేచ్ఛ' ఛస్తా! ఛస్తా! . ఇలాగే వొంటరిగా ఛస్తా...కనబడుతున్నాయి! కనబడుతున్నాయి! . తిట్టకు తిట్టకు కవీ! నీ వాక్కులు వినబడుతున్నాయి...'కనబడలేదా మరో ప్రపంచపు అగ్ని కిరీటపు ధగధగలు! . ! ఎగిరించకు లోహ విహంగాలను, కదిలించకు సుప్త భుజంగాలను' ...'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచం బాధ అంతా శ్రీ శ్రీ బాధ ..' నిజం నిజం బాధ నిజం .. లేదు హజం! . 'మొగులు మొగులున వెలుగులు నిగుడ; దొడగె, మెఱుగు మెఱుగు నునుఱుములు వెందుకొనియె' ..'రాజాన్న భోజన ప్రాభవశ్రీ గల్గియును, వన్యధాన్యంబు నొల్లమనరు!'.. మరి ఇంకా... 'పాఱ జూచిన బరసేన బాఱజూచు . వింటి కొరిగిన రిపు రాజివింటి కొఱుగు!' ధూర్జటి విజయ విలాసం... చేమకూర కాళహస్తి మాహాత్మ్యం...చేమకూర చేదు బాబు...కంద...కందము...'కాకోదర కుందవరపు కవి చౌడప్పా!'...చెప్పు కందం చెప్పు...'అందంగా మధురస నిష్యందంగా'...'నీకొక సిగరెట్టిస్తా నా కొక శతకము వ్రాసి నయముగా యిమ్మా!'...'వాగ్నీతవు నీవె, మహాగ్రగణ్యైర్వీధరము నీవె...సిరిసిరి మువ్వా!...' 'ఎక్కడా చల్లటి నీడల్ని వర్షించే చెట్లులేని...ఎర్రటి ఎడారి జీవితంలో నడవలేక...ఎంత స్వార్థం పాపనీ నీకు! నీ మీద ఎంతమోజు నీకు!'...పద్మా మరి నువ్వో! మరి నీకో!

...కాని పద్మా సూర్యుడు కొడిగట్టినా నేను నీకు ద్రోహం చేద్దామనుకోలేదు...'అందువలన ప్రతి రచయితకీ మొదటి శ్రోతా విమర్శకుడూ తనే!' 'ఏదోవో కాయితం, ఏదో వో పాత కలం చేతపట్టుకుని కూర్చో! ఏదన్నా కథ వొచ్చిందా రాయి...' రాకపోతే?...ఏడు ఏడు!...' అందమైన భావమూ ఉవ్వెత్తుగాలేచే తరంగ వేగమూ, మల్లె మొగ్గ అరవిరిసీ తీరు'...'రణరణరణ ఝుణఝుణఝుణ ... కనకదుర్గ కాలి అందె . నా గీతం పులిపంజా!' ... పురిపండా పులిపంజా...పంజాపండా పురిపులి ..'నీడల కొండచిలువలు వెలుతురు కుందేళ్లను మ్రింగి'...చాలు చాలు కవిత్వం చాలు! మేలు మేలు మేలు భళీ!...'డాక్టర్ యాక్టర్ సిస్టర్ మిస్టర్!' సిస్టర్! మణీ సిస్టర్. 'ఒంట్లో నీరసంగావుంది. కళ్లు మూతలు పడుతున్నాయి. నే బ్రతుకుతానా సిస్టర్?...చల్లని తల్లీ... చక్కని చెల్లీ! ఎంతమంచిమాటిన్నావు సిస్టర్.. మత్తుఇంజక్షను ప్రభావమా అది?...'జనావళికి శుభం పూచి' నాకు ఫరవాలేదా సిస్టర్! థాంక్యూ! థాంక్యూ! థాంక్యూ!

(అయిపోయింది)

(దిఙ్మాత్రంగా ఆంధ్రభాషా సౌందర్యాన్ని ప్రదర్శించాలన్న ధ్యేయంతో యీ చిన్న రచన చేశాను. ఇందులో ఉదాహృతభాగాల కర్తలైన ప్రాచీన, అర్వాచీన, కవులకు, రచయితలకు, కృతజ్ఞుణ్ణి. పఠనా సౌలభ్యం కుంటుపడుతుందనే దృష్టితోనూ, గ్రంథవిస్తర భీతితోనూ, అధస్సూచికలను, రచనల వివరాలను యివ్వలేదు! తరంగాలు తరంగాలుగా వచ్చే ఊహల అలజడిలో కొంత అస్పష్టత ఉన్నా సహృదయులు క్షమిస్తారని, నా ప్రయత్నాన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా.)

అంకితం : ఆంధ్ర సాహిత్యంపై అభిరుచి కలిగించిన మా పెదనాన్నగారు జగన్మోహినీ కేశవ శతకకర్త శ్రీ పెద్దాడ రామలింగయ్యగారికి భక్తితో.